గడప గడపలో 'సంక్షేమ' కాంతులు



పీఎంసీ చైర్మన్ లక్ష్మునాయుడుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి రాజన్నదొర



ఎస్సీ కాలనీ రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి, తదితరులు

• డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు నింపుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజనశాఖా మాత్యులు పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని బడేవలసలో మూడో రోజులో భాగంగా శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్తూ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంక్షేమ పథకాలను సక్రమంగా అందిస్తున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అవినీతిరహిత పాలన అందిస్తుడండంతో టీడీపీ నాయకులు ఓర్వలేక అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాల తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

రహదారి సౌకర్యం కల్పించండి

రహదారి సౌకర్యం కల్పించాలని బడేవలస ఎస్సీ కాలనీవాసులు మంత్రి రాజన్నదొరను కోరారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి పీఎంసీ చైర్మన్..

పేరెంట్స్ మనటరింగ్ కమిటీ చైర్మన్, టీడీపీ నాయకుడు చాపాన లక్ష్మునాయుడు తన అనుచరులతో కలిసి మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందించి ఆదుకుంటున్నారని తెలిపారు. పాలన నచ్చి పార్టీలోకి చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల పార్వతి, ఎంపీటీసీ సభ్యురాలు సువ్వాని విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



పైడితల్లికి పూజలు చేస్తున్న భక్తులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాం రైల్వే కాలనీలో పైడితల్లి ఆలయ ప్రారంభోత్సవం శనివారం నిర్వహించారు. ఉదయం 5 గంటలకే ఆలయానికి చేరుకున్న భక్తులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రూ.2 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణానికి సంబంధించి, శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని శివరాంపురం–చెల్లంపేట బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో 2.65 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరితగతిన పనులు చేపట్టి, రోడ్డును వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఆర్అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటింటికీ వైద్యం



చిన్నారి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ ఉషారాణి

సీతానగరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటింటికీ వైద్యసేవలు అందించడం జరుగుతోందని సీతానగరం ఆర్‌సీహెచ్ వైద్యురాలు ఉషారాణి తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌సీహెచ్ ఆస్పత్రిలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించిన ఆమె అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో అమలవుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం రోగాలతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లలేని వారికి, దూర ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందలేని పేదవారికి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఈ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గడువులోగా కుళాయి నిర్మాణ పనులు



కుళాయిల నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: గడువులోగా ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రావుపల్లి పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని అంటిపేట గ్రామంలో కుళాయి నిర్మాణ పనులను శనివారం పరిశీలించిన ఆయన దాదాపు రూ.37 లక్షల వ్యయంతో ఇంటింటికీ తాగునీరు అందేలా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ప్రధాన పైపులైన్ పనులు పూర్తి చేసి, అక్కడక్కడ కుళాయిల ఏర్పాటు కూడా చేశామన్నారు. వెంకటాపురం, వెన్నెల బుచ్చింపేట గ్రామాల్లో కుళాయి నిర్మాణ పనులు పూర్తికావచ్చాయన్నారు. త్వరలోనే అంటిపేటలోని కుళాయి పనులు కూడా పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరికి మహేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు వి.దానబాబు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఏపీ టిడ్కో చైర్మన్‌తో విశ్వబ్రాహ్మణ కుల సంఘ సభ్యులు, తదితరులు

పార్వతీపురం: చేతివృత్తుల వారి జీవనోపాధికి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేయాలని విశ్వబ్రాహ్మణ కుల సంఘ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై శనివారం పార్వతీపురానికి విచ్చేసిన ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

• 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పులిగుమ్మి గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర ప్రజల బాగోగుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పరితపిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచిపేరుందన్నారు. ఇప్పటివరకు అమలు చేసిన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజుల్లోనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ఇదే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు గండి శంకరరావు, వెంపలి గురువురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



సమావేశంలో పాల్గొన్న గళావిల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు

బలిజిపేట: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. శనివారం మండలంలోని గళావిల్లి పీహెచ్‌సీలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరైన ఆమె ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం కూడా అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి పీహెచ్‌సీ అభివృద్ధికి మంజూరు చేసిన రూ.1.5 లక్షలతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఈఓ రాధాకృష్ణ కొన్ని ప్రతిపాదనలు చదివి వినిపించారు. డీఫ్రిజ్, వ్యాక్సిన్ నిల్వకు ఫ్రిజ్ ఇన్వర్టర్ల నిమిత్తం రూ.45 వేలు కేటాయించడం జరిగిందని, అలాగే కుర్చీలు, కంప్యూటర్లు, ప్రింటర్, స్కానర్, ఆపరేషన్ గదిలో ఇన్వర్టర్, స్వీపర్లకు నెలవారీ జీతాల కోసం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. వీటికి కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. గళావల్లి గ్రామం నుంచి పీహెచ్‌సీ వరకు 150 మీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన చేయడం జరిగిందని జెడ్పీటీసీ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్ర చూడామని, ఎంపీపీ నాగమణి, ఎంపీడీఓ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ రికార్డుల పరిశీలన

గరుగుబిల్లి: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. ఉల్లిభద్ర గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని సూచించారు. జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు.

'ఆల్ ఇన్ వన్'తో ఉత్తీర్ణత శాతం పెంపు



విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

సీతానగరం: పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఆల్ ఇన్ వన్ బుక్ దోహదపడుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి మహ్మద్ గయాజుద్దీన్ అన్నారు. శనివారం మండలంలో మరిపివలస బాలికల వసతిగృహ సంక్షేమ అధికారి బి.గౌరీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షలనగానే భయపడొద్దని, ఎప్పటిలాగే ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు చదివిన అనంతరం ఆస్ ఇన్ వన్ పుస్తకాలు చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పార్వతీపురంటౌన్: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి మల్లిఖార్జునరెడ్డి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్కూల్ బస్సులు, వాహనాలను తనిఖీ చేసిన ఆయన వాహనాలు కండిషన్‌లో ఉన్నాయా లేదా అనే విషయం పరిశీలించారు. కండిషన్‌లో లేని వాహనాలను నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి, మొత్తం 17 కేసులు నమోదు చేశామని, ఉల్లంఘనుల నుంచి రూ.35 వేల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ శశికుమార్, ఏఎంవీఐ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పాలకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో సరస్వతీ దేవి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. మండల విద్యాశాఖాధికారి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విగ్రహావిష్కర చేసి వందనం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ జి.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీల వినతి



ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కురుపాం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నాయకులు ఐసీడీఎస్ కార్యాలయం అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ మండల నాయకులు పాల్గొన్నారు.

విక్రంపురంలో గ్రామసభ



మాట్లాడుతున్న కళింగ మల్లేశ్వరావు

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామంలో సర్పంచ్ కళింగి శైలజమ్మ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించడంతో పాటు గిట్టుబాటు వేతనం అందేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భీమయ్య, ఉపాధిహామీ పథక సాంకేతిక సహాయకుడు జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు



ఘటన స్థలంలో క్షతగాత్రుడు

పార్వతీపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని జోగింపేట వద్ద శనివారం జరిగింది. పార్వతీపురం ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రాయగడకు చెందిన గుడుపూరు అప్పలనాయుడు లోచర్ల గ్రామం నుంచి సీతానగరం మీదుగా పార్వతీపురం పట్టణానికి స్కూటీపై వస్తున్నాడు. అదే సమయంలో పార్వతీపురం నుంచి సీతానగరం వైపు మోటార్ బైక్‌పై వస్తున్న బి.స్వామినాయుడు జోగింపేట వద్ద ఒకరినొకరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అప్పలనాయుడు ఎడమకాలు, తల వెనక భాగం, మోకాలిపై గాయాలు కాగా, స్వామినాయుడుకు కూడా శరీరంలోని పలుచోట్ల గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తెలుకుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యే జోగారావుకు వినతిపత్రం అందజేస్తున్న తెలుకుల సంఘ సభ్యులు

పార్వతీపురంటౌన్: తెలుకుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా రాష్ట్ర అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘ సభ్యులు పార్వతీపురం మన్యం జిల్లాకు శనివారం విచ్చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తెలుకుల అభివృద్ధికి చొరవ చూపాలని ఎమ్మెల్యేకు సభ్యులు వినతిపత్రం అందజేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, తెలుకుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతరం, స్టేట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియా, దేవ తెలుకుల రాష్ట్ర సమైక్య అధ్యక్షుడు అడ్డా వీర వెంకటరాజు, గాండ్ల, దేవ తెలుకుల, తెలుకుల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లు ఉయ్యూరు నాని, చెవిటి వెంకటరమణారావు, మన్యం జిల్లా అధ్యక్షుడు రావుపల్లి రామయ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: జగనన్న తెలుకుల నేస్తం పేరిట ఓ పథకం పెట్టి, తెలుకుల సంఘ సంక్షేమానికి తోడ్పడాలని రాష్ట్ర గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా స్థానిక పట్టణానికి వచ్చిన ఆయన తెలుకుల ఐక్యత, సంక్షేమం, అభివృద్ధి అంశాలపై కాసేపు మాట్లాడారు.

ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లు వాడాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

• డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: పిల్లల్లో రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లను క్రమం తప్పకుండా వేయాలని డీఐఓ(జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి) టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. శనివారం స్థానిక పట్టణంలోని 22, 23వ వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్య సిబ్బంది వేస్తున్న ఐరన్ సిరప్‌ల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి ఐదేళ్ల వయసున్న పిల్లలకు వారానికి రెండు సార్లు క్రమం తప్పకుండా సిరప్‌లు వేయాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు వారి బరువు, ఎదుగుదలను పరిశీలించాలన్నారు. పోషకాహార లోప, శారీరక ఎదుగుదల లేని, బరువు తక్కువగా ఉన్న, రక్త హీనత కలిగిన పిల్లలను ఎన్ఆర్‌సీ కేంద్రాలకు రిఫర్ చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షణ చేసి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు బి.పుష్ప, జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో సమావేశమైన ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి

సీతానగరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్ రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని బళ్లకృష్ణాపురం గ్రామంలో రామమందిరం వద్ద లబ్ధిదారులతో సమావేశమైన ఆయన అర్హులైన ప్రతీ పేదవాని సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నిర్మాణానికి అవసరమైన సామగ్రి, ఆర్థికసాయం చేస్తోందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సదుపాయాలు వినియోగించుకుని, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, హౌసింగ్ ఏఈ జానకీరాం, ఏపీఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీసూర్య పీఠంలో రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకే ఆలయాలకు చేరుకున్న భక్తులు తమ సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, దేవదేవుని పూజలు, ప్రాతఃకాలార్చన, క్షీరాభిషేకాలు, ఉదయం 10 గంటలకు ఉషా, పద్మినీ ఛాయా సమేత శ్రీసూర్యభగవానుని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి సహస్ర దీపాలంకరణతో పాటు శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యుల భజన కార్యక్రమం చేశారు. రాత్రి 7 గంటలకు ఊంజల్, పూలంగి సేవ జరిపారు. రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని, శ్రీసూర్యా యోగా సెంటర్ గురువు మోహన్ గంతాయత్ ఆధ్వర్యంలో విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

శరవేగంగా భూముల రీసర్వే

భామిని: మండలంలో చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూసర్వే శరవేగంగా జరుగుతోందని తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. గురండి, వడ్డంగి, పక్కుడుబద్రి, బత్తిలి, బొమ్మిక రెవెన్యూ గ్రూపుల పరిధిలో డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్(డీఎల్ఆర్) సర్వే పూర్తయిందన్నారు. పెద్దదిమిలి, చిన్నదిమిలి, నులకజోడులో గ్రౌండ్ ట్రూతింగ్(జీటీ) పనులు కొనసాగుతున్నాయన్నారు. దూర ప్రాంతాల్లో ఉంటున్న రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందివ్వాలని కోరారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సవరిస్తామన్నారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు ఉన్నారు.